హెల్మెట్ తప్పనిసరి..

ఫ్లెక్సీలతో అవగాహన కల్పిస్తున్న అమలాపురం ట్రాఫిక్ పోలీసులు



అమలాపురంలో 'డబ్బులు ఊరికే రావు..' అంటూ ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అమలాపురంటౌన్,మార్చి 2(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఉల్లంఘనలకు ఇకపై భారీ జరిమానాలు విధించనున్నట్టు అమలాపురం ట్రాఫిక్ ఎస్ఐ ఎం.ఏసుబాబు తెలిపారు. ఇప్పటివరకు రవాణాశాఖ అధికారులు ఒకవిధంగా, ట్రాఫిక్ పోలీసులు మరో విధంగా జరిమానాలు విధిస్తున్నారు. ఇకపై రెండు శాఖలవారు ఒకే విధమైన భారీ జరిమానాలను విధించనున్నారు. హెల్మెట్ లేకుండా మోటారు సైకిల్ నడిపే వారికి రూ.వెయ్యి, వెనుక కూర్చొన్నవారు హెల్మెట్ ధరించకపోయినా రూ.వెయ్యి జరిమానాలు వేయనున్నారు.

ట్రాఫిక్ పోలీసుల అవగాహన

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన కొత్త మోటారు వెహికల్ చట్టం ప్రకారం విధించనున్న భారీ జరిమానాలను వివరిస్తూ ట్రాఫిక్ ఎస్ఐ ఏసుబాబు ఆధ్వర్యంలో అమలాపురం పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ఫ్లెక్సీలు,హోర్డింగులను ఏర్పాటుచేశారు. డబ్బులు ఊరికే రావు.. డ్రైవర్‌గారు.. జర భద్రం అంటూ పట్టణంలో పలుచోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు టాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్ఐ తెలిపారు.

జరిమానాలు ఇలా..

ఇప్పటివరకు హెల్మెట్ లేకుండా మోటారుసైకిల్ నడిపితే రూ.100 జరిమానా ఉండేది. ఈ నెల 1నుంచి ఆ జరిమానాను రూ.వెయ్యికి పెంచారు. బీమా లేకుండా వాహనం నడిపితే మొదటిసారి తప్పుగా రూ.2వేలు, రెండోసారి రూ.4వేలు జరిమానా విధిస్తారు. లైసెన్సు లేకుండా వాహనం నడిపితే రూ.5వేలు, కాలుష్య ధ్రువీకరణపత్రం లేకపోతే రూ.1500, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే మొదటి తప్పునకు రూ.1500, రెండోసారి అలా చేస్తే భారీగా రూ.10వేలు జరిమానా విధించనున్నారు. యూనిఫామ్ లేకుండా ఆటో నడిపితే రూ.150, రెండోసారి రూ.300, సీటు బెల్టు ధరించకపోతే రూ.వెయ్యి, ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్, రెన్యువల్ సర్టిఫికెట్లు లేకపోతే మొదటిసారి రూ.2వేలు, రెండోసారి రూ.5వేలు, అతివేగంగా వాహనం నడిపితే రూ.వెయ్యి, మోటారు సైకిల్‌పై ముగ్గురు ప్రయాణిస్తే రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించనున్నారు. భారీ జరిమానాలను దృష్టిలో పెట్టుకుని వాహనదారులు తస్మాత్ జాగ్రత్త.

పట్టభద్రుడు.. ఎవరో!



ఏలూరు సీఆర్‌ఆర్‌లో కౌంటింగ్ ఏర్పాట్లు

నేడే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్

- ఏలూరు సీఆర్‌ఆర్‌లో ఏర్పాట్లు
- 36 గంటల పాటు లెక్కింపు
- అధికారుల అంచనా
- నిరవధికంగా సాగేలా చర్యలు
- షిఫ్టుల వారీగా సిబ్బంది
- బరిలో 35 మంది అభ్యర్థులు
- ఫలితం తేల్చేది ప్రాధాన్యత ఓట్లే

(ఏలూరు, అమలాపురం- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఏలూరు సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫలితం వెలువడే వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఓట్ల లెక్కింపు సిబ్బందిని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ జరుగుతున్న తీరును రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పర్యవేక్షిస్తారు.అభ్యర్థుల పక్షాన ఏజెంట్లు సైతం కౌంటింగ్‌కు హాజరవుతారు. ఈ ఓట్ల లెక్కింపు కాస్త సుదీర్ఘంగానే కొనసాగబోతోంది. లెక్కింపు ఒక కొలిక్కి వచ్చేసరికి 36 గంటలు లేదా ఆపైబడి సమయం పడుతుందని భావిస్తున్నారు.

నేడు ఓట్ల లెక్కింపు..

పట్టభద్రుల నియోజకవర్గ ఓట్లను సోమవారం లెక్కించనున్నారు.గత నెల 27న పోలింగ్ జరగ్గా 2 లక్షల 18 వేల 902 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అధికార పక్షం భావిస్తోంది.పోలింగ్ సమయంలోనే నువ్వానేనా అనే ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో గత ఐదు రోజులుగా పోటీ చేసిన 35 మంది అభ్యర్థులతో పాటు, వారి అనుచరులు ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పట్టభద్రుల నియోజకవర్గంలో ప్రాధాన్యతా ఓటు ప్రకారం కొనసాగుతుంది.ఈ ప్రక్రియ అత్యంత సంక్లిష్టం కావడంతో కౌంటింగ్ సిబ్బందికి తగినంత శిక్షణ ఇచ్చారు. సోమవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉదయం 6.30 గంటల్లోపే నిర్దేశిత ప్రాంతాలకు చేరుకోవాల్సిందిగా సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది, టేబుల్స్ సూపర్‌వైజర్లు, రోల్ ఇన్‌చార్జులు, పర్యవేక్షణాధికారులు తమ పరిధిలో బాధ్యతలు నిర్వర్తించాల్సిందిగా ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు తెరిచే సమయంలో కట్టలు కట్టడం, ఆ తర్వాత లెక్కించే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ మేరకు జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి మార్గనిర్దేశం చేశారు.

లెక్కింపునకు 36 గంటలు

సాధారణ ఎన్నికల కంటే భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే దాదాపు 2 లక్షలకు పైగా బ్యాలెట్ పత్రాలను లెక్కించాల్సి ఉంది. అందుకే ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. తొలుత మొత్తం పోలైన ఓట్లలో చెల్లుబాటు కాని ఓట్లను గుర్తిస్తారు. ఇవి పోను, మిగిలిన ఓట్లను ప్రాధాన్యత క్రమంలో ఏ అభ్యర్థికి దక్కాయో వరుసగా లెక్కిస్తారు.ఈ ప్రక్రియ యావత్తు కొనసాగడానికి కాస్త సమయం పడుతుంది. ఓట్ల లెక్కింపు నిరవధికంగా కొనసాగడానికి వీలుగా లెక్కింపు సిబ్బంది,అధికారులను షిఫ్టుల వారీగా నియమించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పోలైన 2 లక్షల 18 వేల 902 ఓట్లను ఒక కొలిక్కి తేవాలంటే ఒక రోజంతా పడుతుందని భావిస్తున్నారు. ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు.. 17 రౌండ్లుగా ఉండేటట్లు నిర్దేశించారు. దీనికి అనుగుణంగా అన్నీ ఏర్పాట్లు చేశారు. ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీ చేసినందున ఆ మేరకు మరింత అప్రమత్తం అయ్యారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ముందుగా చెల్లని ఓట్లను తొలగించడం, మిగతా ఓట్లను కట్టలుగా కట్టి టేబుల్‌కు వెయ్యి చొప్పున మొత్తం 28 టేబుళ్లకు కలిపి 28 వేల వేల ఓట్లు లెక్కించడం ఆరంభిస్తారు. ఇలా 17 రౌండ్లు లెక్కింపు సాగుతుంది. రాత్రి పొద్దుపోయే సమయానికి ఈ ముందస్తు ప్రక్రియ ఒక్క కొలిక్కి రాగలదని,ఆ తర్వాతే అసలు సిసలైన ఓట్ల లెక్కింపు గాడినపడుందని అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆసాంతం పదేపదే సరి చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడున్న అధికారిక అంచనాల ప్రకారం లెక్కింపునకు 36 గంటలు దాటి సమయం పట్టే అవకాశం ఉంది.

నేడు ఎమ్మెల్సీ ఉత్కంఠకు తెర

రాజమహేంద్రవరం/అమలాపురం/కలెక్టరేట్(కాకినాడ),మార్చి2(ఆంధ్రజ్యోతి):మరికొన్ని గంటల్లో ఎమ్మెల్సీ ఉత్కంఠకు తెరపడనుంది. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 35 మంది పోటీ పడగా గురువారం పోలింగ్ జరిగింది. ఈ మేరకు ఓట్లను సోమవారం ఏలూరులో లెక్కించనున్నారు. మొత్తం 3,14,984 ఓట్లు ఉండగా, 2,18,902 ఓట్లు పోలైన సంగతి తెలిసిందే. ఇది 69.50 శాతం.అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో మొత్తం 4669 ఓట్లు ఉండగా 3637 ఓట్లు పోలయ్యాయి. ఇది 77.9 శాతం. డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం 64,471 ఓట్లు ఉండగా 47,125 ఓట్లు పోలయ్యాయి. ఇది 73.09 శాతం. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 62,970 ఓట్లు ఉండగా 42,446 ఓట్లు పోలయ్యాయి. ఇది 67.41శాతం. ఏలూరు జిల్లాలో 42,282 ఓట్లు ఉండగా 29,651 ఓట్లు పోలయ్యాయి. ఇది 70.13 శాతం. కాకినాడ జిల్లాలో మొత్తం 70,540 ఓట్లుండగా, 47,150 పోలయ్యాయి. ఇది 66.84 శాతం. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 70052 ఓట్లు ఉండగా, 48,893 ఓట్లు పోలయ్యాయి. ఇది 69.8శాతం. ప్రధానంగా పోటీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం..పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవుల మధ్యన ఉన్నట్టు సమాచారం. పట్టభద్రులు ఎవరికి పట్టం కట్టారనేది మరికొన్ని గంటల్లోనే తేలిపోనుంది. ఆరు జిల్లాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను ఏలూరులో భద్రపర్చారు. ఓటింగ్ సరళి ప్రకారం పరిశీలిస్తే.. ఫలితాలు రావడానికి 14గంటలుగానీ, 36 గంటల నుంచి 48 గంటలుగానీ సాగే అవకాశం ఉందంటున్నారు.



కాటన్ బ్యారేజీకి

మంచిరోజులు

117 గేట్ల మార్పునకు నిధులు

- ఫలించిన ఎదురుచూపులు
- బ్యారేజీ మరమ్మతులకు నిధులు
- రూ.150 కోట్ల ప్రతిపాదనలు
- రూ.146 కోట్లు మంజూరు
- నేడో రేపో టెండర్లు పిలుపు
- గత ప్రభుత్వంలో చిన్నచూపు
- ఐదేళ్లు కనీస మరమ్మతుల్లేవ్
- కూటమి రాకతో బ్యారేజీపై దృష్టి
- నిధుల విడుదలకు ప్రయత్నాలు
- డ్రిప్ పథకం కింద మంజూరు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి పూర్వవైభవం రానుంది.కూటమి ప్రభుత్వం చొరవ కారణంగా ఈ వారంలో డ్రిప్ పథకం కింద రూ.146 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ వేసవిలోనే టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టనున్నారు. దీంతో బ్యారేజీ మనుగడకు ముప్పు తప్పినట్టయింది. గత ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరైన నిర్వహణ లేక కాటన్ బ్యారేజీ మరమ్మతులకు గురైంది. ఈ మేరకు ఢిల్లీలోని సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యుసీ) 2022లో స్వయంగా పరిశీలించి తక్షణం మరమ్మతులు చేయకపోతే సమస్య ఉత్పన్నమవుతుందని అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అయినా పట్టించుకోలేదు. గతేడాది జనవరి 11,12 తేదీల్లో ప్రపంచ బ్యాంక్ నిపుణుల బృందం బ్యారేజీని పరిశీలించి మొత్తం 117 గేట్లను మార్చి కొత్తవి అమర్చాలని సూచించింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కదలికలేదు. ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకూ 7 కిలోమీటర్ల పొడవున బ్యారేజీకి 175 ఫ్లడ్ గేట్లు, 22 స్లూయిజ్‌లు కలిసి మొత్తం 197 ఉన్నాయి. గత ప్రభుత్వం అసలు బ్యారేజి నిర్వహణ పట్టించుకోకపోవడంతో చాలా గేట్లు నిర్వహణ కష్టమవుతోంది.ఆపరేట్ చేసే సమయంలో అవి మొరాయిస్తున్న సంగతి కూడా తెలిసింది.

10.5 లక్షల ఎకరాల ఆయకట్టు

వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరంతా లక్షలాది టీఎంసీలు ధవళేశ్వరం కాటన్ బ్యారేజి గుండా దిగువకు వెళ్లాల్సిందే. ఎంత నీరు వచ్చినా 175 గేట్లు దాటి అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుండా సముద్రంలోకి పోతుంది. అంతే కాకుండా ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో తూర్పుగోదావరి, కాకినాడ,అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 10.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు బ్యారేజీ కారణంగానే నీరందుతుంది. 2 కోట్ల మంది ప్రజలకు మంచినీరు, పలు పరిశ్రమలకు నీరు లభిస్తోంది.బ్యారేజి ఏ మాత్రం దెబ్బతిన్నా ఏటిగట్టూ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.ఇంతటి ప్రాధాన్యత ఉన్న బ్యారేజీ కాపాడడానికి వైసీపీ ప్రభుత్వం కనీస ఆలోచన చేయలేదు.సీడబ్ల్యుసీ నిపుణులు 117 గేట్లు మొత్తం మార్చేయాలని చెప్పినా పట్టించు కోలేదు.ఇరిగేషన్ అధికారులు కొన్ని ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు.

నిధులు మంజూరు ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ బ్యారేజీని డ్యామ్ రిహేబిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రామం (డ్రిప్)లో పెట్టారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ నుంచి గత జూన్‌లో అప్పటి డీఈ రమేష్ ఢిల్లీ వెళ్లి రూ. 150కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చి వచ్చారు. ఇందులో గేట్లు రీప్లేస్‌మెంట్, మరమ్మతులకు రూ.110 కోట్లు అంచనా వేశారు. ఎలక్ట్రికల్ , కేబుల్, కంట్రోలు ప్యానల్‌కు సుమారు రూ. 9.5కోట్లు అంచనా వేశారు. రోడ్ల నిర్మాణానికి రరూ.4 కోట్లు,సివిల్ వర్కుకు రూ.18 కోట్లు, భవన నిర్మాణానికి రూ.3 కోట్లు అంచనా వేశా రు. రూ. 150 కోట్లు ప్రతిపాదించగా రోడ్ల నిర్మాణం పూర్తికావడంతో రూ.146 కోట్లకు అనుమతిచ్చి శాంక్షన్ చేశారు.దీంతో బ్యారేజీకి మంచిరోజులొచ్చినట్టు అయింది.

రక్షణ ఏదీ?

- ఆదమరిచి ప్రయాణం చేస్తే అంతే సంగతులు
- పి.గన్నవరం మండలం రాజవరం-పొదలాడ రహదారిలో కోతకు గురైన రహదారి
- కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిన ఆర్‌అండ్‌బీ అధికారులు



పి.గన్నవరం మండలం రాజవరం-పొదలాడ రహదారిలో వాడ్రేవుపల్లి సమీపంలో పంటకాల్వ వైపున రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

పి.గన్నవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆ రహదారిలో ప్రయాణం అద్భుతం. కానీ రక్షణ శూన్యం. అర్ధరాత్రిళ్లు పొరపాటున వాహనం అదుపుతప్పితే కాలువలోకి జారి గల్లంతు కావాల్సినపరిస్థితులు.. మండలంలోని రాజవరం-పొదలాడ రోడ్డులో సమస్యాత్మక ప్రదేశాలపై సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులతోపాటు స్థానికులు సైతం భయాందోళనలకు గురవుతున్నారు.

పొరపాటున జారితే అంతే..

పి.గన్నవరంమండలంలోని పొదలాడ నుంచి రాజవరం రహదారి మొత్తం 61.425 కిలోమీటర్లు ఉంది. పొదలాడనుంచి పి.గన్నవరం మండల పరిధిలోని గంటిపెదపూడి వరకు 22.425కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. రోడ్డంతా ప్రధాన పంట కాల్వ చెం తనే ఉంటుంది. ఇటీవలే రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. కానీ రహదారి చెంతనే ప్రధాన పంటకాల్వ వైపు పలుచోట్ల కోతకు గురికావడంతో ఆ ప్రదేశాలు ప్రమాదకరంగా మారాయి. వాహనదారుడు ఆదమరిచి ప్రయాణిస్తే రెప్పపాటులో పంటకాల్వలో ఉండాల్సిందే. గంటిపెదపూడి నుంచి నాగుల్లంక వరకు భారీస్థాయి ప్రమాదాలు అనేకం జరగ్గా చాలా మందిప్రాణాలు కోల్పోయారు.ఉడిమూడి శివారు చింతావారిపేట, బెల్లంపూడి, గంటిపెదపూడి, నాగుల్లంకతదితర ప్రదేశాల్లో భారీ ప్రమాదాలు జరిగాయి. దీంతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చింతావారిపేటవద్ద పంటకాల్వ చెంతనే తాత్కాలికంగా మట్టివేయించారు.

నివేదిక కోరిన కలెక్టర్

జిల్లాలో 400కిలోమీటర్లమేర రాష్ట్ర రహదారులు విస్తరించి ఉన్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టిసారించిన కలెక్టర్ సమస్యాత్మక ప్రదేశాలపై ఆర్‌అండ్‌బీ అధికారులనుంచి నివేదిక కోరినట్లు తెలిసింది. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్రను వివరణ కోరగా ఎమ్మెల్యే గిడ్డిసత్యనారాయణ సూచనతో పి.గన్నవరం మండల పరిధిలో ప్రధాన పంటకాల్వ చెంతనే 12 సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి రక్షణ చర్యలు నిమిత్తం కలెక్టర్‌కు పంపించినట్లు తెలిపారు.

రక్షణ చర్యలతోనే పరిష్కారం

గంటిపెదపూడి నుంచి పొదలాడ వరకు 12 సమస్యాత్మక ప్రదేశాలను అధికారులు గుర్తించారు. అక్కడ కాల్వవైపు రక్షణగోడలు ఏర్పాటుచేస్తే ప్రమాదాలనుంచి పూర్తిగా బయటపడవచ్చు. తాత్కాలికంగానైనా జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన మాదిరిగా ఇనుప క్రాస్ బేరర్లు ఏర్పాటు చేస్తే అదుపు తప్పిన వాహనాలను కాల్వలోకి వెళ్లకుండా అడ్డుకునే అవకాశం ఉంది.

పల్లెకు.. పండగేదీ!



అసంపూర్తిగా గోకులం షెడ్

బిల్లులు రాక.. నిలిచిన పనులు

- ఇప్పటికే నీరసించిన పనులు
- ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి
- రూ.147 కోట్లు పెండింగ్
- సీసీ రోడ్లవే రూ.110 కోట్లు
- అసంపూర్తిగా గోకులాలు
- పూర్తికాని డ్రెయినేజీల నిర్మాణం
- ఎక్కడి పనులు అక్కడే
- నిధులు రాక కాంట్రాక్టర్ల లబోదిబో

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

పల్లె పండగ పేరుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అనేక పనులు అప్పుడే నీరసించాయి. బిల్లులు రాకపోవడంతో రెండు నెలలుగా ఎక్కడివి అక్కడే అన్నట్టు ఈసురోమంటున్నాయి. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి సంబంధించి బిల్లులు ఆలస్యం అవడంతో పలు చోట్ల వీటిని కాంట్రాక్టర్లు నిలిపివేశారు. బిల్లులు వచ్చాక తిరిగి చేద్దామనే ధోరణితో మధ్యలోనే వదిలేశారు. అటు గోకులాల షెడ్లను తొలుత సొంత నిధులతో ప్రారంభించిన రైతులు సైతం బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.4 కోట్ల వరకూ బిల్లులు విడుదల కావాల్సి ఉంది. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లా వ్యాప్తంగా రూ.147 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రూ.110 కోట్లకుపైగా బకాయిలు సీసీ రోడ్లవే కాగా మిగిలినవి గోకులాల షెడ్ల బాకీలున్నాయి. అయితే బకాయిల్లో కేంద్రం నుంచి సగానికిపైగా, మిగిలినవి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ నుంచి విడుదల కావాల్సి ఉన్నాయి. మరో పక్క రైతులు ముందుకురాని చోట్ల కాంట్రాక్టర్లు నిర్మించిన గోకులాల షెడ్లలో అప్పుడే నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి.



అసంపూర్తిగా ఉన్న సీసీ రహదారి

వచ్చాక చూద్దాం..

వాస్తవానికి రెండునెలలుగా అధికారులు అదిగోఇదిగో అంటున్నా బిల్లులు రాకపోవడంతో అటు కాంట్రాక్టర్లు, ఇటు రైతులు పనులను మధ్యలో ఆపేశారు. సీసీ రహదారులకు సంబంధించి ఒక్కో పనిని రూ.3 లక్షల వరకు విభజించి నామినేషన్ ప్రాతిపదికపై కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీరంతా చిన్నాచితకా కాంట్రాక్టర్లు కావడంతో బిల్లులు రాక పనులు చేయలేమని తెగేసి చెప్పేస్తున్నారు. కొందరైతే ప్రారంభించినవి మధ్యలో ఆపేయగా, మరికొందరు బిల్లులు వస్తేనే పని మొదలుపెడతామని తెగేసి చెబుతున్నారు. వాస్తవానికి పల్లె పండగకు పనులకు సంబంధించి ఉపాధి హామీ పనుల ద్వారా సమకూరే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వెచ్చిస్తున్నారు. ఈ నిధులు 75 శాతం కేంద్రం, మిగిలిన 25 శాతం రాష్ట్రప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆర్థికంగా అనేక ఇబ్బందులున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి కొంత జాప్యమవుతోంది. కాగా ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల గోకులాల షెడ్లను ముందుగా తమ సొంత నిధులతో నిర్మించుకోలేని రైతుల కోసం అధికారులే కొందరు కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పనులు చేయి ంచారు. వీటిలో చాలా వరకు నాణ్యతా లోపాలు బయటపడుతుండడం విశేషం.

రూ.147 కోట్ల బకాయి

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల పరిధిలో కొత్తగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం గతేడాది అక్టోబరు 14 నుంచి పల్లె పండగ పేరుతో అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఉపాధి హామీ పథకానికి సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్, ఆర్థిక సంఘం నిధుల ద్వారా బిల్లులు చెల్లించే విధంగా పనులకు జిల్లాల వారీగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామాల్లో ఎక్క డెక్కడ సీసీ రోడ్లు, డ్రెయినేజీలు అవసరమో గుర్తించి వాటిని నిర్మించడానికి వీలుగా అంచనాలు సిద్ధం చేశారు. రైతుల కోసం గోకులాల షెడ్లను ఈ పథకంలో చేర్చారు. సీసీ రహదారులు, డ్రెయిన్లు, గోకులాల షెడ్లకు సంబంధించి కాకినాడ జిల్లాలో మొత్తం రూ.180 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. ఇందులో ఇప్పటి వరకు రూ.38 కోట్ల బిల్లులు చెల్లించారు. కానీ పూర్తయిన, మధ్యలో కొనసాగుతున్న పనులకు సంబంధించి ఇంకా రూ.42 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. డిసెంబరు నెలాఖరు వరకు ఠంచనుగా వచ్చిన బిల్లులు ఆ తర్వాత నుంచీ పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా అనేక పనులను అటు కాంట్రాక్టర్లు, ఇటు రైతులు నిలిపివేశారు. బిల్లులు వస్తేనే తిరిగి చేయగలమంటూ అధికా రులకు తెగేసి చెప్పేశారు. మరో పక్క బిల్లులు రాకపోవడంతో రూ.102 కోట్లకు సంబంధించి వివిధ దశల్లో ఉన్న పలు పనులపైనా ప్రభావం పడింది. అనేక చోట్ల కాంట్రాక్టర్లు వీటిని మధ్యలో నిలిపివేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 650 సీసీ రహ దారులు, 675 గోకులాల షెడ్లను ఈ పథకం కింద ప్రారంభించారు.ఇప్పటి వరకు కొన్ని బిల్లులు చెల్లింపులు జరగ్గా, ఇంకా రూ.65 కోట్ల వరకు బాకీలు పేరుకుపోయాయి.ఇందులో రూ.4 కోట్ల వరకు గోకులాల షెడ్లకు సంబం ధించిన బిల్లులుండగా,మిగిలిన రూ.61 కోట్లు సీసీ రహదారులవే ఉన్నాయి.అటు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోను రూ.40 కోట్ల వరకు బిల్లులు పేరుకుపోయాయి. సింహభాగం సీసీ రహదారులవే. మొత్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.147 కోట్లు బకాయిలుగా తేలాయి.ఇవి రాక అనేక పనులపై ప్రభావం పడింది.

మిర్చి పంటను పీల్చేస్తున్న తామర పురుగు



తామరపురుగు సోకి దిగుబడిన లేని మిర్చి తోట

» వెలవెలబోతున్న మిర్చి తోటలు » దెబ్బతిని నల్లగా మారిపోతున్న వైనం

» పంట దిగుబడిపై తీవ్రప్రభావం » నష్టాల్లో మిర్చి రైతులు

ఎటపాక, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఎర్ర బంగారంగా పిలిచే మిర్చిపంటకు గత నాలుగేళ్లగా ప్రతికూల పరిస్థితులు ఎదుర వుతున్నాయి. వాణిజ్య పంట అయిన మిర్చికి తామరపురుగు పట్టి పీడిస్తూ ఉండడంతో పాటు వరుస నష్టాలతో రైతులు ఇక ముమ్మందు పంటకు విరామం ప్రకటించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అసలే మిర్చి పంటకు సరైన ధరలేక రైతు సతమతమవుతున్న తరుణంలో పంటకు తామర పురుగు సోకి, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో రైతుకు కోలుకోలేని విధంగా దెబ్బమీద దెబ్బ తగులుతోంది. దాంతో మిర్చి సాగుని నమ్ముకున్న రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక సాగు చేయడం తమవల్ల కాదంటూ తేల్చి చెబుతున్నారు. అల్లూరి జిల్లాలోని విలీన మండలాల్లో ఈ ఏడాది సుమారు 4 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. గతనెల జనవరి వరకు పంటకు తామర పురుగు వ్యాపించకుండా బాగున్నప్పటికీ ఫిబ్రవరి ప్రారంభంలో మిర్చి పంటకు తామర పురుగు ఆశించింది. అయితే ఈ పురుగు పంటకు పూత దశలో వ్యాపించడంతో పంట ఆకు రసం పీల్చి, పంట స్వరూపాన్ని మార్చేస్తోంది. ఆ తర్వాత పంట ముడతబారి, నల్లగా మారిపోయి దిగు బడిపై తీవ్ర ప్రభావంను చూపుతోంది. ఎన్ని రకాల పురుగు మందులు పిచికారీ చేసినా ఎటువంటి ప్రయోజనం ఉండడంలేదని రైతులు పేర్కొంటున్నారు.

కళా విహీనంగా మిర్చి తోటలు

ఈ ఏడాది జనవరి నెల వరకు బాగానే ఉన్నా మిర్చి తోటలు ఫిబ్రవరిలో సోకిన తామరపురుగుతో తోటలన్నీ కళాహీనంగా మారి వెలవెలబోతున్నాయి. సాధారణ సమయంలో ఎకరాకు 20 నుంచి 25 క్వింటాల వరకు పంట దిగుబడి వచ్చేదని తామరపురుగు ప్రభావంతో ఎకరాకు ఆరేడు క్వింటాల మించి దిగుబడిరాని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఎటపాక మండలంలో ప్రధానంగా గన్నవరం, తోటపల్లి, నందిగామ, మురుమూరు, కృష్ణవరం నల్లకుంట, విస్సాపురం, నెల్లిపాక తదితర గ్రామాల్లో మిర్చి తోటలకు తామరపురుగు ఆశించింది. గత నెలలో మొదటి దశ మిర్చి కోతలు నిర్వహించారు. ఆ తర్వాత తామర పురుగు వ్యాపించడంతో దిగుబడి రాక తోటలన్నీ పంటకాలం ముగిసినట్టుగా మారి పోయాయి. దాంతో రైతులు కొందరు పశువులను ఆ తోటల్లో మేపుతున్నారు.



గన్నవరంలో తామరపుగురు సోకిన తోటలో పశువులను మేపుతున్నరైతు

తగ్గిన పంట దిగుబడి

తామరపురుగు, వైరస్‌ల ప్రభావంతో గత నాలుగేళ్లగా మిర్చి రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. రెండేళ్ల నుంచి మిర్చి రైతులది గడ్డు పరిస్థితి. ఈఏడాది సాగుకు సాహసించని పరిస్థితి. అయినా ఈసారైనా పంట కలిసోస్తుందని కొండంత ఆశతో సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది పెరిగిన ఖర్చులతో ఎకరాకు రూ 1.50లక్షల పెట్టుబడులు అయినట్లు రైతులు చెబుతున్నారు. తామరపురుగు దెబ్బకు ఎకరాకు ఆరేడు క్వింటాలు మాత్రమే పంట దిగుబడి వచ్చిందని, మరోసారి పంట కోతలు చేపట్టే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడ్నాలుగుసార్లు కోతలు చేపట్టే మిర్చికి ఒక్కసారి కోతలతో ముగించేసే పరిస్థితి రావడంతో రైతులు నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి దిగుబడి ఆ స్థాయిలో లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే తోటలన్నీ కళతప్పి ఉన్నాయి. మరోవైపు ప్రస్తుత మిర్చి క్వింటా ధర రూ.11వేల నుంచి 12వేల మధ్య పలుకుతోందని, ఇంతలా ధర ఎప్పుడూ పతనమవలేదని రైతులు పేర్కొంటున్నారు.

రూ.15 లక్షలు నష్టపోయాను

● పూజారి వెంకన్న, రైతు, గన్నవరం



ఈఏడాది 9ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. జనవరి నెల వరకు పంట బాగానే ఉన్నా, గత ఇరవై రోజుల నుంచి మిర్చికి తామరపురుగు ఆశించింది. 9 ఎకరాల పంట మొత్తం నల్లగా మారి దెబ్బతింది. ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పంటకు రూ15 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. రూ 14 లక్షల నష్టం వచ్చింది.

తామరపురుగు వదలడంలేదు

● మల్లాడి దావీద్, రైతు, గొల్లగూడెం



గత మూడేళ్ల నుంచి మిర్చికి తామరపురుగు వ్యాపించే పీడ పోవడంలేదు. ఎన్ని మందులు పిచికారీ చేసినా పూర్తి స్థాయిలో పురుగు నశించడంలేదు. వ్యవసాయశాఖ అధికారులు తామర పురుగు శాశ్వత నివారణకు చర్యలు అన్వేషించడంలేదు. వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు పంటపై పరిశోధనలు చేసి తామర పురుగును అరికట్టాలి.



రాయవరం: వెదురుపాక మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

● ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

రాయవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దైవ గ్రంథం ఖురాన్ అవతరించిన నెలకు ఇస్లాం మతంలో ప్రత్యేకస్థానం ఉంది. ముస్లింలకు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభమైంది. శనివారం రాత్రి నెలవంక కనిపించడంతో ముస్లిం పెద్దల ఆదేశాలకు అనుగుణంగా 2వ తేదీ నుంచి నెలరోజుల పాటు ముస్లింలు నెలరోజు లపాటు పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు చేపట్టారు. ఈనెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు, ప్రత్యేక నమాజ్‌లను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఇందులోభాగంగా తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్షలు చేపట్టి ముస్లింలు రాత్రి వరకు దైవారాధనలో గడుపుతారు. ఖురాన్ సూచించిన విధంగా నెలరోజులపాటు ఉపవాసం సమయంలో మంచినీరు తీసుకోకుండా రాత్రి వరకు దీక్ష కొనసాగిస్తారు. వెదురుపాక, రాయవరం, లొల్ల, చెల్లూరు, పసలపూడి గ్రామాల్లో ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టారు. వెదురుపాకలో మతపెద్ద షేక్ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో మసీదును విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగర పరిధిలోని ఉన్న అన్ని మసీదులు ముస్లిం భక్తులతో నిండి కిటకిటలాడాయి. నెలరోజులపాటు జరిగే ఉపవాస దీక్షల్లో ముస్లిం ప్రజలు పాల్గొని ఈ ఉపవాస దీక్షలను అవలంభిస్తారు. మసీదుల్లో ప్రార్థనలు ప్రారంభమవగా ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రంజాన్ విశిష్టతను జాబియా మసీదు అధ్యక్షుడు ఏజాజుద్దీన్ మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ముస్లిం లు కఠోర ఉపవాస దీక్ష ఉండి సాయంత్రం మసీదులో దీక్షను విరమిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా గంజిని అన్ని మసీదుల్లో తయారుచేస్తామన్నారు. దీన్ని సేవించడంవల్ల శరీరంలో ఉన్న నీరసంపోయి శక్తి వస్తుందన్నారు. అలాగే రాత్రి 8.30కు జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో ఖురాన్ పటిస్తామని తెలిపారు.



కాకినాడలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కవి సంధ్య కవితల పోటీ విజేతలు

యానాం,మార్చి2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా యానాం కవిసంధ్య, చిన్ని నారాయణరావు ఫౌండేషన్ నెల్లూరు సంయుక్తంగా నిర్వహించిన వచన కవితల పోటీ విజేతలను కవి సంధ్య అధ్యక్షుడు శిఖామణి ప్రకటించారు. వీరిలో ప్రథమ బహుమతి నూజివీడుకు చెందిన డాక్టర్ జడా సుబ్బారావు (ఒంటరైఉమ్మడి తనం), ద్వితీయ బహుమతి తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటకు చెందిన పర్కపల్లి యాదగిరి (తర్పణం), తృతీయ బహుమతి దుబ్బాకకు చెందిన ఐలేని గిరి (నడిచిన పాదాలు) నిలిచారు. అదేవిధంగా పది కవితలకు ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. వీరిలో శ్రీకాకుళంనకు చెందిన వినోద్ గుత్తం (పాపం నాజేబు), తూర్పుగోదావరిజిల్లాకు చెందిన మోకా రత్నరాజు (సృష్టికర్తలం), గోకవరంనకు చెందిన జేడీ వరలక్ష్మీ (శ్రమదేహాలు), తెలంగాణా రాష్ట్రం ఆదిలాబాద్‌కు చెందిన బి.వేణుగోపాలరెడ్డి (సాగుదూరం), యానాంకు చెందిన పోనుగుమట్ల అశోక్‌కుమార్ (పచ్చని చెట్టులా), విజయవాడకు చెందిన బి.వి.శివప్రసాద్ (యుద్ధము-శాంతి), తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన పిన్నంశెట్టి కిషన్ (ఇల్యూషన్), నిర్మల్‌కు చెందిన తమ్మల దేవ్‌రావ్(వరి గొలకులు), తెలంగాణా రాష్ట్రం ఆదిలాబాద్‌కు చెందిన ఉదారి నారాయణ (గాజుల పండుగ)లు ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారు. ఈపోటీలకు ప్రముఖ కవి కోడూరి విజయ్‌కుమార్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈనెల 23న ఆదివారం సాయంత్రం హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయంలో జరిగే ప్రపంచ కవితా దినోత్సవంలో బహుమతులను ప్రదానం చేయనున్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కాకినాడ క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాకినా డ జగన్నాథపురం స్వప్న థియేటర్ సమీపంలో పేకాడుతున్నారన్న పక్కా సమాచారంతో సీఐ ఎం.నాగదుర్గారావు తన బృందంతో కలిసి శిబిరంపై ఆదివారం దాడి చేశారు. 12 మందిని కాకినాడ వన్ టౌన్ పోలీసులు అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.22,620 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కొత్తపల్లిలో ఘరానా మోసం

● రుణాలు ఇప్పిస్తానంటూ లక్షలాది రూపాయలు వసూలు

కొత్తపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అమాయకులైన వ్యక్తుల బలహీనతలను ఆసరాగా తీసుకుని వారి అవసరాలకు రోజువారీ అప్పులు, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తానంటూ వేలకు వేలు దోచుకున్న ఘరానా మోసగాడి విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాకినాడకు చెందిన వి.ప్రసాద్ సెక్యూరిటీ సర్వీస్‌లో పనిచేసేవాడు. కాకినాడజిల్లా కొత్తపల్లికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో పరిచయాలు పెంచుకున్నారు. తక్కువ వడ్డీకి అప్పులు, ప్రైవేటు బ్యాంకులో రుణాలు ఇప్పిస్తానంటూ కొత్తపల్లికి చెందిన పలువురు చేతి పనులు, కూలీనాళీ చేసుకునే వారి దగ్గర నుంచి రూ.3వేలు నుంచి రూ.5వేలు వరకు నగదుతో పాటు ఆధార్‌కార్డులు తీసుకున్నాడు. తాను కూడా ఈ విధంగా మోసపోయానని బాధితుడు ఉడతా వెం కన్న వాపోయాడు. మోసం చేశాడని గ్రహించిన వారు ప్రసాద్‌ను సొమ్ము మొత్తాన్ని ఇవ్వమని ప్రాధేయపడగా తమపై కేసులు పెడతానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగి న అన్యాయంపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వెంకన్న చెప్పాడు.

కాకినాడ ఆర్ఎంసీలో..

వైభవంగా స్నాతకోత్సవ సంబరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహం

248మంది వైద్యవిద్యార్థులకు పట్టాల ప్రదానం

ముఖ్యఅతిథిగా డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ నరసింహం

జీజీహెచ్(కాకినాడ), మార్చి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో 62వ స్నాతకోత్సవ సంబరం అంబరాన్నంటింది. 2019-2025 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన సుప్రీం స్టాల్ వార్ట్స్ బ్యాచ్ అన్నీ తామై స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించింది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 248మంది వైద్యవిద్యార్థులు పట్టాలు పొందారు. కార్యక్రమానికి 5వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంఈ, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరయ్యారు. గౌరవ అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో విజయనగరం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, హెచ్‌వోడీలు డాక్టర్ డి.మాణిక్యాంబ, డాక్టర్ ఉమామహేశ్వరరావు, ఐఎంఏ నాయకులు డాక్టర్ చిట్ల కిరణ్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఆదిత్య సత్యప్రసన్న, ఆర్ఎంసీ బోధకులు డాక్టర్ ఎన్.శైలజ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైద్య రంగంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వైద్యుడికి ప్రత్యామ్నాయం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదని పేర్కొన్నారు. భావోద్వేగాలను గుర్తించే గుణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు లేదన్నారు. తాను ఆర్ఎంసీనుంచి వెళ్లి రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో కీలక విధులు నిర్వర్తించడానికి తనకు ప్రత్యామ్నాయంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ప్రిన్సిపాల్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించడమే కారణమన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు చేసిన త్యాగాలను ఎన్నటికీ మరువరాదన్నారు. డాక్టర్ దేవీమాధవి, డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు ఇది ఒక కొత్త అధ్యాయమన్నారు. విద్యార్థులు వైద్యులుగా మాత్రమే కాకుండా రోల్ మోడ ళ్లుగా తీర్చిదిద్దాలన్నారు. రోగులు, సమాజం పట్ల కృతజ్ఞతతో మెలగాలన్నారు. పేరు ముందు డాక్టర్ అని రావడం గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థులతో వైద్య ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహాన్ని సత్కరించారు. 2019-2025 బ్యాచ్‌లో అత్యంత ప్రతిభావంతుడుగా గుర్తించిన డాక్టర్ సాయి అనిరుధ్ ఉపన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 9 అవార్డులు, 5 బంగారు పతకాలు సాధించిన ఆయన అందరి దృష్టిని ఆకర్షించారు. ఐదున్నరేళ్ల విద్యలోని పాఠ్యాంశాలు ఎంతో విలువైనవన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ రంగరాయ వైద్య కళాశాలలో అత్యంత క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన పిల్లలకు అందిందని హర్షం వ్యక్తం చేశారు. రంగరాయలో తమ పిల్లలు చదువుతున్నందుకు గర్వపడుతున్నామంటూ ఎవరికైనా చెప్పడంలో ఎంతో సంతృప్తి ఉంటుందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

'జయలక్ష్మి సొసైటీ పాలకవర్గం పనితీరుపై అసంతృప్తి'

సర్పవరంజంక్షన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరానికి పాల్పడినవారు బెయిల్‌పై బయట తిరగడం, సిట్ నివేదిక ప్రకారం బోర్డు బకాయిల వసూళ్లు, నిందితులపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవడంలో ఉదాసీన వైఖరి, సిట్ నిందితుడిగా పేర్కొన్న వ్యక్తిని డైరెక్టర్‌గా కొనసాగించడం, జవాబుదారీతనం లోపించడంవంటి కారణాలతో జయలక్ష్మి సొసైటీ పాలకవర్గంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు ది జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ లిమిటెడ్ డిపాజిటర్స్ బాధితుల సంఘం సభ్యులు తెలిపారు. బోర్డు సభ్యులను రీకాల్ చేసేందుకు తక్షణం మహాజన సభ నిర్వహించి సీక్రెట్ ఓటింగ్ తో పాలకవర్గాన్ని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కాకినాడ విద్యుత్నగర్‌లోని చల్లా కల్యాణ మండపంలో జయలక్ష్మి సొసైటీ డిపాజిటర్ల బాధితుల సంఘం సభ్యు ల సమావేశాన్ని అధ్యక్షుడు జి.బదరీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయనతోపాటు సెక్రటరీ పిల్లి గణేష్, జాయిం ట్ సెక్రటరీ ఎస్.రామారావు, ట్రెజరర్ వీఎస్ సుబ్బారావు, కొంతమంది సభ్యులు మాట్లాడా రు. 2022 ఏప్రిల్‌లో రూ.560 కోట్లతో బోర్డు తిప్పేసిన అప్పటి ఛైర్మన్ ఆంజనేయులు, వైస్ ఛైర్‌పర్సన్ విశాలాక్షిలతోపాటు డైరెక్టర్లు పరారయ్యారన్నారు. బాధితులంతా కలిసి అడ్‌హక్ కమిటీ, తర్వాత పర్మినెంట్ బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. నూతన కమిటీ పగ్గాలు చేపట్టి రెండున్నర ఏళ్లు కావస్తున్నా బాధిత డిపాజిటర్లు ఆశించిన మేర పనిచేయలేదన్నారు. అర వై మంది బాధితులు మృతి చెందారన్నారు. కేసుల వివరాలు, నిందితుల ఆస్తులజప్తు వివరాలు, సివిల్, క్రిమినల్ కేసులపై సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వట్లేదని విమర్శించారు. బోర్డులో ఉన్న ఇద్దరు సభ్యులు ఉద్యోగరీత్యా వేరేచోట ఉంటున్నారన్నారు. డైరెక్టర్ల స్టాగర్డ్ టర్మ్ పూర్తవ్వడం, డైరెక్టర్లు రాజీనామా చేసిన వాటి వివరాలను ఛైర్మన్ ఎవరికీ చెప్పట్లేదని ఆరోపించారు. బ్యాంకింగ్, కో-ఆపరేటివ్ సెక్టార్లలో అనుభవమున్న సభ్యులతో డైరెక్టర్లను భర్తీచేయాలని కోరినా పట్టించు కోవట్లేదన్నారు. ప్రభుత్వ అధికారులను డైరెక్టర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు.100మంది బాధితులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బదిరీనాథ్

ఏలేశ్వరంలో పిచ్చికుక్క స్వైరవిహారం

● 15మందికి గాయాలు

ఏలేశ్వరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):నగర పంచాయతీ పరిధిలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి 15మందిని గాయపరిచింది. ఆదివారం స్థానిక నెయిల్‌పేట, మందుల కాలనీ, పెద్దవీధి, నందివీధులలో పిచ్చికుక్క కరవడంతో వీరంతా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. వీరిలో కార్తికే య, జాన్ అనే చిన్నారులను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యురాలు శైలజ తెలిపారు.

రావులపాలెంలో బ్యాటరీ బైక్ దగ్ధం



దగ్ధమైన బ్యాటరీ బైక్

రావులపాలెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో పార్కింగ్ చేసిన బ్యాటరీ బైక్ నుంచి మంటలు వ్యాపించి దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పశ్చిమగోదావరిజిల్లా మార్టేరు సమీపంలోని నిక్కపూడికి చెందిన సత్తి పెద్దిరెడ్డి స్థానికంగా ఉన్న బంధువుల ఇంటికి బ్యాటరీ బైక్‌పై వచ్చారు. అక్కడ పార్కింగ్ చేసి లోపలి వెళ్లారు. కొంతసేపటికి బైక్‌లోంచి మంటలు చేలరేగి పెద్దఎత్తున వ్యాపించడంతో బైక్‌లోని బ్యాటరీలు పెలుతాయనే భయంతో సమీపంలోని ప్రజలు పరుగులు తీశారు. పార్కింగ్ చేసిన బ్యాటరీ బైక్ కళ్లేదుటే కాలిపోవడంతో బైక్ యజమాని షాక్‌కు గురయ్యాడు. దీంతో పెద్దిరెడ్డికి స్థానికులు సపర్యలు చేసి ధైర్యాన్ని అందించారు.

సిద్ధివినాయక ఆలయంలో అక్షరాభ్యాసాలు



అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

అయినవిల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం ఫాల్గుణమాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేశారు. అయినవిల్లి క్షేత్రంలో భక్తులు ఈతి బాధల నివారార్థం నిత్యం జరిగే శ్రీలక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్నారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు.

అర్తమూరు ముద్దు బిడ్డగా గర్విస్తున్నా

● గ్రామంలో ఆధ్యాత్మిక పరిమళాలు భేష్

● గ్రామాభివృద్ధికి సహకరిస్తా : యూపీ డీజీపీ రామశాస్త్రి



యూపీ డీజీపీ వెంకట రామశాస్త్రి దంపతులను సత్కరిస్తున్న స్థానికులు, మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

మండపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి) ఆగస్త్య మహాముని, పెద్ద జీయర్, చిన్నజీయర్‌లు జన్మించిన పుణ్యభూమి అర్తమూరులో జన్మించినందుకు తనకెంతో గర్వంగా ఉందని యూపీ డీజీపీ పిడపర్తి వెంకట రామశాస్త్రి అన్నారు. మండపేట మండలం ఆర్తమూరు గ్రామంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారి 17వ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమానికి డీజీపీ వెంకటరామ రామశాస్త్రి, నీరజ దంపతులు ఆదివారం రాత్రి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన ప్రముఖులు, ఆలయ నిర్వాహకులు రామశాస్త్రి, నిరజ దంపతులకు ఆలయ మర్యాదలతో ఆదివారంరాత్రి ఘనస్వాగతం పలికారు. శాస్త్రి తాను పుట్టిపెరిగిన అర్తమూరులో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసు కున్నారు. ముందుగా శాస్త్రి దంపతులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఆలయ నిర్వాహకులు శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ట్రస్టీ ఎస్.బీఎస్.ఆర్ ట్రస్టీ సత్తి బుల్లి స్వామిరెడ్డి అధ్యక్షతన శాస్త్రి దంపతులను ఘనంగా సత్కరించారు. అర్తమూరుకు చెందిన శాస్త్రి ఇక్కడ ప్రజలకు చేసిన సేవలను వారు కొనియాడారు. శాస్త్రి తండ్రి రామం గ్రామంలో ఎంతోమందికి విద్యాభ్యాసం చేయించారని ఆయనవద్ద నేర్చుకున్న వారేందరో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. తాను ఏ స్థాయిలో ఉన్నా ఇక్కడ మూలాలు మరిచిపోనని అర్తమూరు వాసులకు ఏ సాయం కావాలన్నా తన వంతు అందిస్తానని ఆయన చెప్పారు. ఇక్కడ వాతావరణం ఆధ్యాత్మిక చింతన ఎంతో బాగుందన్నారు. శాస్త్రి దంపతులను అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తిసూర్యానారాయణరెడ్డి, ఆలయట్రస్టీ సత్తి బుల్లిస్వామిరెడ్డి, కర్రి బాపిరెడ్డి, పడాల సుబ్బారెడ్డి తదితరులు ఘనం గా సత్కరించారు. రాజమహేంద్రవరంనకు చెందిన స్వామీ న్యూరాలజీ ఆసుపత్రి వైద్యులు పరిమి నాగసత్య ప్రసాద్, డాక్టర్ సత్తి బుల్లి స్వామిరెడ్డి దంపతులను ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

రాజ్యాంగ హక్కులపై ప్రజలకు అవగాహన అవసరం

● ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల

యానాం,మార్చి2(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యంగంలో దేశ ప్రజలకు అంబేడ్కర్ కల్పించిన హక్కులపై ప్రజలకు పూర్తి అవగాహనతోపాటు హక్కుల పరిరక్షణకు ఉద్యమించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ పౌరహక్కుల సంఘ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది ముప్పాల సుబ్బారావు అన్నారు. యానాం సర్వశిక్ష అభియాన్ సమావేశపు హాలులో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75ఏళ్లు అయిన సందర్భంగా ఏపీ హేతువాద సంఘం, యానాం సివిల్‌రైట్స్ సొసైటీ, యానాం డాక్టర్ అంబేడ్కర్ సంక్షేమసంఘ సంయుక్త నిర్వహణలో జనజాగృతి సభ ఆదివారం నిర్వహించారు ఈ సభలో ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ రాజ్యంగంలో అంబేడ్కర్ ఎంతో దూరదృష్టితో ప్రజలకు మత స్వేచ్ఛతోపాటు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ కల్పించారన్నారు. కానీ, అవి హరించ బడుతున్నాయన్నారు. రాజ్యాంగ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. సభలో అఖిల భారత హేతువాద సంఘం ప్రతినిధి నార్నె వెంకటసుబ్బయ్య శాస్త్రీయ, మానవతా దృక్పథంపై ప్రారంభోపన్యాసం చేశారు. సభకు యానాం సివిల్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం ప్రముఖకవి దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ దేశానికి పటిష్టమైన రాజ్యాంగం ఉండడంవల్ల ఎన్నో తట్టుకుని దేశం నిలబడుతుందన్నారు. సమావేశంలో మాజీ పరిపాలనాధికారి గిడ్డి బలరాం, నామడి అప్పారావు, పండు సిద్ధార్థ కుమార్, దవులూరి పతి పాల్గొన్నారు.



ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావుకు అమరజ్యోతి అంబేడ్కర్ పుస్తకాన్ని అందజేస్తున్న రచయిత పొనుగుమట్ల విష్ణుమూర్తి

కనకమహాలక్ష్మమ్మ పందిరి రాట ముహూర్తం

అంతర్వేది, మార్చి2(ఆంధ్రజ్యోతి): మోరి శ్రీకనక మహాలక్ష్మమ్మ మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు పందిరి రాట ముహూర్తం చేశారు. ఆదివారం శేషారాయుడు కాల్వగట్టుకు చెందిన శెట్టిబలిజ, రజక కులస్తుల సేవ వైభవంగా జరిగిందన్నారు.

చినరాజప్ప పరామర్శ

ఉప్పలగుప్తం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సన్నవిల్లిలో గనిశెట్టి గోవిందరాజులు ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం పరామర్శించారు. గనిశెట్టి కమార్తె, అయినవిల్లి మాజీ జడ్పీటీసీ గంగుమళ్ళ అన్నపూర్ణను పరామర్శించారు. గంగుమళ్ళ శ్రీనివాసరావు, గనిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

కనుల పండువగా వీరేశ్వరుని తెప్పోత్సవం

- గోదావరి మాతకు పంచహారతులు
- శివనామ స్మరణతో పులకించిన మురమళ్ళ




వీరేశ్వరుని తెప్పోత్సవం, పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ఐ.పోలవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): భక్తుల శివనామస్మరణతో గోదావరి తీరం పులకించింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి మాతకు పంచహారతులు ఇచ్చారు. హంస వాహనంపై ఆశీనులైన వీరేశ్వరస్వామి పవిత్ర గోదావరిలో విహరించారు. ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావు, పురోహితుడు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. అధికసంఖ్యలో భక్తులు తరలిరావడంతో గోదావరి తీరం ఓంకార నాదంతో ప్రతిధ్వనించింది. మిరుమిట్లు గొలిపేలా కాల్చిన బాణసంచా భక్తులకు కనువిందు చేసింది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దాట్ల ఇంద్రరాజు, దాట్ల రామకృష్ణంరాజు, కటారి నాని, జంపన బాబు, కటారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రథంపై ఊరేగిన వీరేశ్వరుడు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మురమళ్ళ భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి ఊరేగింపు మహోత్సవం వైభవంగా జరిగింది. నిత్యకల్యాణ శోభితుడైన వీరేశ్వరస్వామి, భద్రకాళీ అమ్మవారు రథంపై ఆశీనులై మురమళ్ళ పుర వీధుల్లో ఊరేగితూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం నుంచి మురమళ్ళ పుష్కరఘాట్ వరకు స్వామి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. కేరళ చాండీమేళం, కేరళ తాంబూలం డప్పులు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే పూణే బ్యాండ్, కాంతారా వేషాలు, మహిళల గరగ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో అఘోరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దేవతామూర్తుల వేషధారణ, బుట్టబొమ్మలు, ఆటపాటలతో స్వామివారి ఊరేగింపు నయనానందకరంగా సాగింది.

నేడు అభివృద్ధి ప్రదాత బాలయోగి 23వ వర్ధంతి

- అభివృద్ధికి ఆమడ దూరంలో బాలయోగి ఘాట్
- ఎంపీ హరీష్‌మాధుర్ నేతృత్వంలో అభివృద్ధికి ప్రణాళికలు




పచ్చదనం కొరవడి మోడుబారిన బాలయోగిఘాట్ ప్రాంగణం, ఫౌంటెయిన్ లేక కుళ్లిన నీటితో దర్శనం

అమలాపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి స్ఫూర్తి ప్రదాత దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి 23వ వర్ధంతి అమలాపురంలోని జీఎంసీ బాలయోగి ఘాట్‌లో సోమవారం నిర్వహించడానికి టీడీపీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి. గడిచిన 23ఏళ్ల కాలంలో ప్రభుత్వాలు ఎన్ని మారినా బాలయోగి ఘాట్, స్టేడియం అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉందన్న చందంగా మారింది. ఇప్పుడు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో అమలాపురం నుంచి లోక్‌సభకు బాలయోగి తనయుడు గంటి హరీష్‌మాధుర్ ఎన్నికయ్యారు. ఆయన హయాంలోనైనా బాలయోగి ఘాట్ రూపురేఖలు మారుస్తారనే ధీమాతో ఆ పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. ఈ దఫాలో అభివృద్ధి చేయకపోతే బాలయోగి స్మృతి వనం శిథిలమయ్యే పరిస్థితులు ఉన్నాయని ఆయన అభిమానులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అయితే బాలయోగి తనయుడు హరీష్ ఇప్పటికే ఈఘాట్ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలతో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే అటు బాలయోగి స్టేడియం, ఇటు బాలయోగి ఘాట్ అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. కాగా మహానాయకుడు బాలయోగి పేరిట నిర్మించిన ఘాట్ ప్రాంగణం పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికీ మోడుబారి పోయింది. బాలయోగి స్మారకార్థం అమలాపురం నల్లవంతెన దిగువన నిర్మించిన ఘాట్‌ను 2012 సెప్టెంబరు 16న అప్పటి ఎంపీ జీవీ హర్షకుమార్ కృషి ఫలితంగా కేంద్ర మంత్రులు మల్లికార్జున ఖర్గే, పనబాక లక్ష్మిలు ప్రారంభిం చారు. నాడు పచ్చదనంతో, విద్యుత్ దీపాలంకరణ లతో కళకళ్లాడుతూ, ఫౌంటెయిన్లతో ఎంతో అద్భుతంగా బాలయోగి ఘాట్‌ను తీర్చిదిద్ది ప్రారంభించారు. నేడు ఆ ప్రాంగణంలో మొక్కల జాడే లేదు. ఇసుమంతైనా పచ్చదనం లేదు. విద్యుత్ వెలుగులు లేవు. ఫౌంటెయిన్లు లేవు. సుందర వనంలా కళకళ్లాడిన ఆ ప్రాంగణం నేడు పాముల పుట్టలు సైతం ఎక్కడికక్కడ దర్శనమి స్తున్నాయి. ఇక ఫౌంటెయిన్లు పనిచేయడంలేదు. పచ్చదనం లేక ఆ ప్రాంగణం మోడుబారి పోయి దర్శనమిస్తోంది. కాగా ఎంపీ హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో సోమవారం బాలయోగి వర్ధంతి నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

మంచుతో మామిడి, జీడిమామిడి తోటలకు నష్టం



చింతలమోరిలో అలుముకున్న పొగమంచు

మలికిపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల తరచూ పొగమంచు ఏర్పడడంతో మామిడి, జీడిమామిడి తోటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిందె పూత దశలో ఉన్న సమయంలో పొగమంచు తేనె మంచులా వదలకపోవడంతో పిందె, పూత రాలిపోతున్నాయన్నారు. తెల్లవారుజాము నుంచి 8గంటల వరకు మండల పరిధిలోని చింతలమోరి, శంకరగుప్తం, కేశనపల్లి, పడమటిపాలెం తదితర గ్రామాల్లో పొగమంచు దట్టంగా పట్టింది. రాజోలు సబ్ డివిజన్‌లో 300ఎకరాల్లో మామిడితోటలు, 186ఎకరాల్లో జీడిమామిడి తోటలు ఉన్నట్టు ఉద్యానవన అధికారులు తెలిపారు. జీడిమామిడికి పెద్దగా నష్టం వాటిల్లదని, పొగ మంచు ప్రభావం మామిడి తోటలపై స్పష్టంగా ఉంటుందన్నారు.

20కిలోల భారీ గుమ్మడి చుక్కచేప



20 కిలోల భారీ గుమ్మడిచుక్క చేప

అల్లవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వివాహాది విందుల్లోను రుచిలోను అమోఘంగా ఉండే గుమ్మడిచుక్క భారీ చేప బోడసకుర్రు మార్కెట్‌లో అమ్ముడుపోయింది. చేపల వ్యాపారి కొప్పాడి దుర్గారావు తన దుకాణం వద్ద 20 కిలోల భారీ గుమ్మడిచుక్క చేపను అమ్మకానికి పెట్టగా రూ.6వేలకు దాన్ని కొన్నారు. గుమ్మడిచుక్క చేపను ఇష్టపడినివారు ఉండరు. అలాగే బోడసకుర్రు మార్కెట్‌లో పులస చేపలు కూడా దర్శనమిస్తున్నాయి. ఒక్కో చేప రూ.వెయ్యి నుంచి రూ.1500వరకు అమ్ముడుపోతుంది. బర్డ్‌ఫ్లూ ప్రచారంతో కోడిమాంసం అమ్మకాలు పడిపోగా మాంసం ప్రియులు చేపల మార్కెట్‌కు వెళ్లి చేపలను కొనుగోలు చేస్తున్నారు.

ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల రిలే దీక్షలు



అమలాపురం రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో డ్రైవర్ బీఎస్ నారాయణ అక్రమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలో కేఎస్వీ ప్రసాద్, కేవీ రావు, వీఎస్ఎన్‌మూర్తి, వీఎల్ రావు, బీటీటీ బాబు, పీఎస్ కుమార్, బీఎస్ రావు, ఎస్ఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, డ్రైవర్ నారాయణపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నినాదాలు చేశారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. గ్యారేజీ గేటు వద్ద గేట్‌మీటింగ్ నిర్వహించి నారాయణపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నినాదాలు చేశారు. ఉప కార్యదర్శి రంగప్రసాద్, డిపో అధ్యక్షుడు ఆర్.నారాయణరావు పాల్గొన్నారు.

కాశీ మృతి క్రీడా రంగానికి తీరని లోటు



అమలాపురం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీవిశ్వనాథం క్రీడా రంగానికి ఎనలేని సేవలు అందించారని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు పేర్కొన్నారు. కాశీ మృతి కోనసీమ క్రీడా రంగానికి తీరని లోటన్నారు. అమలాపురం ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో కాశీ సంస్మరణ సభ నిర్వహించారు. ఎందరినో అత్యున్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత కాశీకి దక్కుతుందని సభకు అధ్యక్షత వహించిన బోనం సత్యవరప్రసాద్ పేర్కొన్నారు. కాశీ చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి, డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ పీఎస్ శర్మ, నూకల సత్యనారాయణ, పుత్సా కృష్ణకామేశ్వర్, కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, మహిళా క్లబ్ అధ్యక్షురాలు అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల అనంతలక్ష్మి, గోకరకొండ కరుణశ్రీ, పలు వ్యాపార సంస్థలు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న యూపీ డీజీపీ



ఐ.పోలవరం, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ డీజీపీ పీవీ రామశాస్త్రి కుటుంబ సమేతంగా ఆదివారం మురమళ్ళ వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వాచన అనంతరం డీజీపీ కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజు, ఆలయ అర్చకుడు యనమండ్ర తేజ, స్వస్తి వాచకుడు నాగాభట్ల రవిప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

14న హలో అమలాపురం.. చలో పిఠాపురం

చలో పిఠాపురం నినాదాలతో కార్యకర్తలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్

అమలాపురం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జనసేన 12వ ఆవిర్భావ సభను పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలో నిర్వహించనున్నట్టు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిత్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఈనెల14న జరిగే ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కోరారు. అమలాపురంలో ఆదివారం నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశానికి శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హలో అమలాపురం.. చలో పిఠాపురం నినాదాలతో కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కల్వకొలను తాతాజీ, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, నాయకులు లింగోలు పండు, ఆకుల సూర్యనారాయణమూర్తి, గండి దేవి హారిక, చిట్నీడి శ్రీదేవి, ఆర్డీఎస్ ప్రసాద్, పడాల నానాజీ, డాక్టర్ కొప్పుల నాగమానస, ఆకుల బుజ్జి, సూదా చిన్నా, నల్లా వెంకటేశ్వరరావు, పరమట చిట్టిబాబు, చాట్ల మంగతాయారు. తిక్కా సరస్వతి, కర్రి లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యత గుర్తెరగాలి



ఆదిత్య పాఠశాల వార్షికోత్సవంలో విజేతలకు బహుమతి అందజేస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతీ విద్యార్థి పెంపొందించుకుంటూ సామాజిక బాధ్యతలను గుర్తెరగాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు అహర్నిశలు కష్టపడాలని సూచించారు. ప్రథమ గురువులైన తల్లిదండ్రులు పిల్లల పెంపకం విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కామనగరువు ఆదిత్య ఉన్నత పాఠశాల 18వ వార్షికోత్సవం ప్రిన్సిపాల్ రాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. జేసీతో పాటు డాక్టర్ గీతిక, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విద్య, క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జేసీ నిషాంతి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులు జేసీ నిషాంతి, గీతికలను ఘనంగా సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రమాద భరితంగా వంతెనలు



అయినవిల్లిలో శిథిలమైన వంతెన

అయినవిల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ నిత్యం రవాణా జరిగే వంతెనలు మండలంలో ప్రమాద భరితంగా తయారయ్యాయి. అయినవిల్లి పంటకాల్వపై వంతెన పురాతన కట్టడం కావడంతో రక్షణ గోడలు కూలిపోయి వంతెన శిథిలమైంది. నిత్యం భారీ వాహనాలు ఈరహదారిపై ప్రయాణిస్తుంటాయి. అయినవిల్లిలో నిర్మిస్తున్న విద్యుత్ స్టేషన్ నిర్మాణానికి భారీ వాహనాలు ఈవంతెనపై రాకపోకలు జరుగుతున్నాయి. ముక్కామల, నేదునూరు నుంచి వచ్చే ప్రయాణికుల వాహనాలకు ఈమార్గమే ప్రధానం. పోతుకుర్రు మురుగుకాల్వపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన కూడా శిథిలమైంది. మహిపాలచెరువు నుంచి ప్రయాణించే వాహనాలకు ఈమార్గం ప్రధానమైంది. కాల్వలపై నూతన వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఉప్పలగుప్తం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం- చల్లపల్లి ప్రధాన పంటకాల్వలో గోపవరం వద్ద ఆదివారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. 55ఏళ్ల పురుషుని మృతదేహంగా పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చలమల రాజేష్ తెలిపారు.

'దళిత అధికారులపై వివక్షను వీడాలి'



దళిత సంఘాల ఐక్యవేదిక సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

అమలాపురం రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దళిత అధికారులపై వివక్షత ఆపని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు హెచ్చరించారు. సీఐడీ మాజీ చీఫ్ పి.సునీల్‌కుమార్‌ను కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాల చేశారు. దళిత ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్ మాట్లాడుతూ దళిత ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల మీద వివక్షను వీడాలని లేనిపక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కన్వీనర్ జంగా బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దళిత సామాజిక అధికారులను టార్గెట్ చేయడం తగదన్నారు. సమావేశంలో వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, దళిత నాయకులు శెట్టిబత్తుల తులసీరావు, వాకపల్లి హరీష్, నక్కా సంపత్‌కుమార్, గెల్లా రాజేంద్ర, మెండి డేవిడ్ అంబేడ్కర్, సాపే రమేష్, జల్లి రాజశేఖర్, ఎం.పండు, జల్లి నరేష్ పాల్గొన్నారు.

పాఠశాలల అసోసియేషన్ నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవాగ్దేవి పాఠశాలలో ముమ్మిడి ప్రతాప్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం అమలాపురం డివిజన్ ప్రైవేటు పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. విద్యానిధి విద్యా సంస్థల అధినేత ఆకుల బాపన్ననాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివిజన్ కమిటీ నూతన అధ్యక్షుడిగా కొత్తూరి లక్ష్మీశ్రీనివాసన్ (ముమ్మిడివరం), కరస్పాండెంట్‌గా గిడ్ల రమేష్ (ఎం.కొత్తపల్లి), కోశాధికారిగా శ్రీకాకోళపు శ్రీరామసతీష్(అమలాపురం)లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. డివిజన్ గౌరవాధ్యక్షుడు నెల్లి రమేష్‌తో పాటు పాఠశాలల అధినేతలు మట్టపర్తి సత్యనారాయణ, మంగళంపల్లి అంజిబాబు, తోట నరసింహం, కంకిపాటి గణపతులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

పీఈటీ ఉండ్రు సేవలు ఆదర్శనీయం

అల్లవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను తీర్చిదిద్దడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, అలాగే కోడూరుపాడు హైస్కూలు పీఈటీ ఉండ్రు ముసలయ్య సేవలు ఆదర్శనీయమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, పలువురు వక్తలు అన్నారు. కోడూరుపాడు జడ్పీ హైస్కూలులో పీఈటీగా ఉద్యోగ విరమణచేసిన ముసలయ్య సన్మాన సభ సత్యకస్తూరి కల్యాణ మండపంలో జరిగింది. ముసలయ్య, వెంకటలక్ష్మి దంపతులను ఉపాధ్యాయ సంఘాలు, అధికారులు ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమీ, జిల్లా స్పోర్ట్స్ అధికారి పి.సురేష్‌కుమార్, నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, జిల్లా ఏఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, పోతంశెట్టి దొరబాబు, ఉండ్రు రాజబాబు, అరిగెల నానాజీ, కేకేవీ నాయుడు, యాళ్ల నాగసతీష్, సరిదే పల్లంరాజు, పాయసం శ్రీనివాసరావు, యిళ్ల మూర్తి పాల్గొన్నారు.

కామనకు పదవిపై కాంగ్రెస్ నాయకుల హర్షం

ముమ్మిడివరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకుడు కామన ప్రభాకరరావును రాష్ట్రా కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా నియమించడం పట్ల ముమ్మిడివరం నియోజకవర్గ సమావేశం హర్షం వ్యక్తం చేసింది. ముమ్మిడివరంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వి.ఉదయభాస్కరవర్మ అధ్యక్షతన ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో వక్తలు మాట్లాడారు. కామన ప్రభాకరరావుకు రైతుల సమస్యల పట్ల వివిధ రంగాల్లో మంచి అనుభవం ఉందన్నారు. ఆయన సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో పెన్మెత్స జగ్గప్పరాజు, వడ్డి నాగేశ్వరరావు, పాలెపు ధర్మారావు, ముషిణి శివప్రసాద్, గోడి భాస్కరరావు, కాశి అచ్యుతలరామయ్య, గుబ్బల రవిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బాలవీరభద్రస్వామి సంబరం



బి.దొడ్డవరంలో వీరభద్రుడి సంబరాన్ని పురస్కరించుకుని భక్తుల ఊరేగింపు

మామిడికుదురు, మార్చి (ఆంధ్రజ్యోతి): బాలవీరభద్రస్వామి సంబరాన్ని బి.దొడ్డవరం గ్రామంలో భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన పినిశెట్టి వెంకటస్వామి ఆధ్వర్యంలో జరిగిన సంబరంలో భక్తులు ప్రభను ఊరేగిస్తూ బాణసంచా కాలుస్తూ వైనతేయ నది వరకు స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ నదిలో స్నానమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరపూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులు బాలవీరభద్రునికి శూలాలతో వీర నాట్యం చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్ పూజలు

అంతర్వేది, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కడప జిల్లా రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం శ్రీధర్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అర్చకులు పాణింగపల్లి శ్రీనివాస్‌కిరణ్ అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



మలికిపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శివకోటి జిల్లాపరిషత్ హైస్కూలులో 1981-82లో పదో తరగతి చదివిని పూర్వ విద్యార్థులు ఆదివారం దిండిలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా దిండి రిసార్ట్స్‌లో కలుసుకుని క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. గత స్మృతులను గుర్తుచేసుకుని ఉల్లాసంగా గడిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

ముమ్మిడివరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మట్టా ఆకాష్‌రెడ్డి మృతిచెందగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం పరామర్శించారు. ఆకాష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని బూరుగువారిపేటకు చెందిన మట్టా ఆకాష్‌రెడ్డి గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. తల్లిదండ్రులు మట్టా సుభాషిణి, మట్టా రాహుల్‌లను ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు, రేకాడి రాంబాబు, అయినవిల్లి వలీబాబా, మట్టా వెంకటరమణ, గిడుగు అనిల్‌కుమార్, కాశి జగపతి, మట్టా గగనవీరుడు ఉన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

అంబాజీపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలోని ఉషా క్లినిక్‌లో ఆదివారం వైద్యాధికారి డీవీ సత్యం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 175మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. డాక్టర్ భావన ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

అంబాజీపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందాదుల్ అంజుమాన్ మసీదులో రంజాన్ మాసం ప్రారంభ ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి దీక్షలు ప్రారంభించారు. ఖురాన్ పఠనంతో ముస్లింలు రంజాన్ నెలను ప్రారంభించారు.

నిరామయ పథకంపై అవగాహన

అమలాపురం రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లిలోని హరిమనో వికాస కేంద్రంలో ఆదివారం శ్రీవివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిరామయ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల నిర్వాహకుడు సల్లాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ నిరామయ పథకంలో చేరిన వారికి రూ.లక్ష ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు. దివ్యాంగులైన పిల్లల తల్లిదండ్రులు ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రాజ్‌కుమార్ వివరించి దరఖాస్తులు చేసుకునే విధానాన్ని తెలియచేశారు. దివ్యాంగుల తల్లిదండ్రులు కోసం హరిమనోవికాస కేంద్రంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. తల్లిదండ్రులతో పాటు పి.ఆనంద్, లోకేశ్, బాబి, సూర్య, కె.ఆనంద్ పాల్గొన్నారు.



మామిడికుదురు: రంజాన్ దీక్షలు ప్రారంభంలో ఖురాన్ పఠనం చేస్తున్న ముస్లింలు

భీమేశ్వరాలయంలో కాకినాడ జేసీ పూజలు


భీమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న జేసీ రాహుల్‌మీనా కుటుంబీకులు

ద్రాక్షారామ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర ఆలయాన్ని ఆదివారం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం నంది మండపంలో వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు జరుపుతున్న దృశ్యం. పక్క చిత్రంలో పూజల్లో పాల్గొన్న భక్తజనం

వాడపల్లి వెంకన్న ఒకరోజు ఆదాయం రూ.5.27 లక్షలు

ఆత్రేయపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.5,27,890 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

5న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆత్రేయపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం గ్రామంలోనున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు 5వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ పాతపాటి వెంకటసత్యనారాయణరాజు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను ఖండవల్లి సూర్యనారాయణ చార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్త లు గోవింద మాలధారణ దీక్షలు చేపట్టారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి పలు సాం స్కృతిక ప్రదర్శనలు, వాహనసేవలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వినయ్ కుమార్‌రాజు తెలిపారు.


పోతురాజు ఆలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న భక్తులు

గనిపోతురాజు విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబికా ఆలయంలో అమ్మ వారి ఆలయానికి ఎదురుగా పునర్నిర్మించిన గనిపోతురాజు విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి అధ్వర్యంలో వేద పండితులు విగ్రహ ప్రతిష్ఠ జరిపించారు. గ్రామానికి చెందిన గన్ని వెంకట్రావు దంపతులు పూజలు చేశారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా పాత ఆలయాన్ని తొలగించడంతో పునర్నిర్మాణం చేశారు. ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న నూకాంబిక అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ముందు గనిపోతురాజు విగ్రహ ప్రతిష్ఠ చేయాలని నిర్ణయించడంతో ఆదివారం దీన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పూర్ణాహుతి, యంత్ర ప్రతిష్ఠ, కలశస్థాపన చేశారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మహిళలు ఆలయంపై నుంచి బూరెలు పోశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు గనిపోతురాజును దర్శించుకున్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో మంత్రి సుభాష్ పూజలు


సీతారామ లక్ష్మణ విగ్రహాలకు పూజలు చేస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల, ఉట్రుమిల్లి గ్రామాల్లో నిర్మించిన ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వెల్ల చినసెట్టిబలిజ పేటలో సీతా, రామ, లక్ష్మణ, హనుమ విగ్రహాల పునఃప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొని పూజలు చేశారు. ఉట్రుమిల్లిలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా జరిపారు. కొన్ని రోజులుగా ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, గ్రామస్థులు పాల్గొన్నారు.

మూలనపడిన డస్ట్ బిన్లు

ఆత్రేయపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అపారిశుధ్య నిర్మూలనకు చెత్త సంపద కేంద్రాలను నిర్మించారు. ఇటీవల అవి నిరుపయోగంగా మారాయన్న ఆరోపణలున్నాయి. పారిశుధ్య నిర్మూలనకు ఉపయోగించే చెత్త సేకరణ రిక్షాలు సైతం తుప్పపట్టి మూలనపడి ఉన్నాయని పలు వురు వ్యాఖ్యానిస్తున్నారు. చెత్త సంపద కేం ద్రాలు అలంకారప్రాయంగా మారడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో తడిపొడి చెత్త సేకరించేందుకు డస్టబిన్‌లను ప్రభుత్వం అందించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో వాటి పంపిణీ నిలిచిపోయింది. చాలా పంచాయతీల్లో ఇప్పటికీ తడిపొడి చెత్త సేకరించే డస్ట్‌బిన్లు ఇళ్లకు అందించకుండా పంచాయతీల్లో మూలనపడి ఉండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


వాడపల్లి సచివాలయంలో మూలనపడిన ఉన్న డస్ట్‌బిన్లు

కనుల పండువగా వీరేశ్వరుని తెప్పోత్సవం

● గోదావరి మాతకు పంచహారతులు
● శివనామ స్మరణతో పులకించిన మురమళ్ల



వీరేశ్వరుని తెప్పోత్సవం, పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ఐ.పోలవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): భక్తుల శివనామస్మరణతో గోదావరి తీరం పులకించింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి మాతకు పంచహారతులు ఇచ్చారు. హంస వాహనంపై ఆశీనులైన వీరేశ్వరస్వామి పవిత్ర గోదావరిలో విహరించారు. ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావు, పురోహితుడు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. అధికసంఖ్యలో భక్తులు తరలిరావడంతో గోదావరి తీరం ఓంకార నాదంతో ప్రతిధ్వనించింది. మిరుమిట్లు గొలిపేలా కాల్చిన బాణసంచా భక్తులకు కనువిందు చేసింది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దాట్ల ఇంద్రరాజు, దాట్ల రామకృష్ణంరాజు, కటారి నాని, జంపన బాబు, కటారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రథంపై ఊరేగిన వీరేశ్వరుడు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మురమళ్ళ భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి ఊరేగింపు మహోత్సవం వైభవంగా జరిగింది. నిత్యకల్యాణ శోభితుడైన వీరేశ్వరస్వామి, భద్రకాళీ అమ్మవారు రథంపై ఆశీనులై మురమళ్ళపుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం నుంచి మురమళ్ళ పుష్కరఘాట్ వరకు స్వామి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. కేరళ చాండీమేళం, కేరళ తాంబూలం డప్పులు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే పూణే బ్యాండ్, కాంతారా వేషాలు, మహిళల గరగ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో అఘోరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దేవతామూర్తుల వేషధారణ, బుట్టబొమ్మలు, ఆటపాటలతో స్వామివారి ఊరేగింపు నయనానందకరంగా సాగింది.



వాడపల్లి శ్రీనివాస ప్రాంగణంలో పునాదికే పరిమితమైన అన్నదాన భవన నిర్మాణం. పక్క చిత్రంలో ఆరుబయట అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు

గోవిందా...వారికి చెప్పవా?

• అరకొర సౌకర్యాలతో స్వామివారి ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు • పునాదికే పరిమితమైన వకుళమాత అన్నదాన భవనం • ఎమ్మెల్యే బండారు సంకల్పంతో రూ.4కోట్లు మంజూరు

ఆత్రేయపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్నా వసతి సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉంటున్నాయని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా ప్రతి శనివారం 20 వేలకు మించి భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. ఆలయం వెనుక భాగంలో ఉన్న అన్నదాన సత్రంలో 300 మంది మాత్రమే కూర్చునే సౌకర్యం కల్పించారు. శ్రీనివాస ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్లలో శనివారం నాడు స్వామివారి అన్నప్రసాదం అందిస్తున్నారు. నేలపై కూర్చుని అరకొర సౌకర్యాల మధ్య భక్తజనం భోజనం స్వీకరిస్తున్నారు. రెండేళ్ల క్రితం అప్పటి ధర్మకర్తల మండలి వకుళమాత అన్నప్రసాద భవనం నిర్మించేందుకు సుమారు 71 సెంట్ల భూమిలో భూమిపూజ చేశారు. దాతల సహకారంతో పునాదిస్థాయికి భవన నిర్మాణం చేరుకుంది. వకుళమాత అన్నదాన భవనంలో సుమారు 3వేల పైబడి భక్తులు అన్నప్రసాదం స్వీకరించేలా డిజైన్ చేశారు. ఇటీవల నిలిచిపోయిన అన్నదాన భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సంకల్పించారు. ఇందులో భాగంగా ఇటీవల ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతో చర్చించి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సుమారు రూ.4కోట్లతో దేవదాయ శాఖ నిధులతో అన్నప్రసాద భవనం నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నారు. త్వరలో వీటి పనులకు శంకుస్థాపన జరిపి ఆరునెలల్లో వకుళమాత అన్నప్రసాదం నిర్మించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. త్వరలో భక్తుల ఇబ్బందులు తొలగిపోనున్నాయి.


తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆత్రేయపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా తైక్వాండో పోటీల్లో ఆత్రేయపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆల్ ఇండియా కరాటే, తైక్వాండో, కుంగ్‌ఫూ పోటీల్లో ఆత్రేయపురానికి చెందిన తోటకూర నయన్‌వర్మ ఎల్లో బెల్ట్, వెపన్స్ కత్తి ప్రదర్శన విభాగంలో ప్రథమస్థానం సాధించారు. వైట్ బెల్ట్ నాన్‌చాక్ విభాగంలో పాలపర్తి దీక్షిత్‌రాజ్ ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా కోచ్ లక్ష్మీ సందీప్‌కిరణ్, గ్రాండ్ మాస్టర్ అబ్బులు, డైరెక్టర్ టి.వెంకటలక్ష్మి, మార్షల్ ఆర్ట్స్ అకాడమిలో విజేతలను సత్కరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్

14న హలో అమలాపురం.. చలో పిఠాపురం

అమలాపురం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జనసేన 12వ ఆవిర్భావ సభను పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలో నిర్వహించనున్నట్టు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఈనెల14న జరిగే ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కోరారు. అమలాపురంలో ఆదివారం నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశానికి శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హలో అమలాపురం.. చలో పిఠాపురం నినాదాలతో కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కల్వకొలను తాతాజీ, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, నాయకులు లింగోలు పండు, ఆకుల సూర్యనారాయణమూర్తి, గండి దేవిహారిక, చిట్నీడి శ్రీదేవి, ఆర్డీఎస్ ప్రసాద్, పడాల నానాజీ, డాక్టర్ కొప్పుల నాగమానస, ఆకుల బుజ్జి, సూదా చిన్నా, నల్లా వెంకటేశ్వరరావు, పరమట చిట్టిబాబు, చాట్ల మంగతాయారు. తిక్కా సరస్వతి, కర్రి లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సులతో ట్రాఫిక్‌కు అంతరాయం

రావులపాలెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ఇష్టానుసారం పార్కింగ్‌తో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. రావులపాలెం ముఖ్య కూడలి వద్ద ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రావులపాలెం మీదుగా ప్రతిరోజూ హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, చెన్నై, ముంబైతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ట్రావెల్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 వరకు రావులపాలెంలో ఆయా ట్రావెల్స్‌కు చెందిన పాయింట్ల వద్ద ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. పోలీస్‌స్టేషన్‌కి సమీపంలో ఉన్న కళావెంకట్రావు సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ఇన్ గేట్ సమీపంలోను, కాకినాడ, అమలాపురం, యానం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు ఒకేసారి పదుల సంఖ్యలో ఈ ప్రాంతాల్లో నిలుపుదల చేస్తున్నారు. నాలుగు రోడ్ల ముఖ్య కూడలి అయిన కళా వెంకట్రావు సెంటర్ వద్ద ట్రాఫిక్ భారీగా నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సులు నిలిపివేస్తున్న కారణంగా కాంప్లెక్స్‌లోకి వెళ్లే ఆర్టీసీ బస్సులు సైతం రహదారిపైనే నిలిచిపోవాల్సి వస్తున్నది. వాడపల్లి వెంకన్నను దర్శించుకునేందుకు శనివారం వేలాది వాహనాలు ఈ ముఖ్య కూడళ్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయి. సాయంత్రం సమయంలో అయితే గంటల తరబడి వాహనాలు నిలిచిపోతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదంతా పోలీస్‌స్టేషన్‌కు సమీపంగా జరుగుతున్నా నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంపై వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ప్రైవేట్ బస్సులతో నిలిచిన ట్రాఫిక్


బీజేపీ నూతన అధ్యక్షుడిగా శ్రీరాములుకు బాధ్యతలు అప్పగిస్తున్న దృశ్యం

బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీరాములు

ఆలమూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల అధ్యక్షుడిగా సుంకర శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చొప్పెల్లలో నాగిరెడ్డి స్వామి అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా సుంకర శ్రీరాములును ఏకగ్రీవంగా ఎంపిక చేసి బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తమలపూడి రామకృష్ణారెడ్డి, అయినవిల్లి సత్తిబాబు, వడ్డి దొరయ్యనాయుడు, ఎంవీ కృష్ణారెడ్డి, బలుసు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా మారిన తాతపూడి పంపింగ్ స్కీం. పక్క చిత్రంలో రిపేరుకు గురైన పంపులు

నిరుపయోగంగా..తాతపూడి పంపింగ్ స్కీం

• పంపులు, మోటార్ల రిపేర్లతో పనిచేయని దుస్థితి • పట్టించుకోని అధికార యంత్రాంగం • వినియోగంలోకి తేవాలంటున్న అన్నదాతలు

కపిలేశ్వరపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం తాతపూడి వద్ద 1969లో నిర్మించిన పంపింగ్ స్కీం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. రైతులకు నీటిఎద్దడి లేకుండా ఉండేందుకు తాతపూడి పంపింగ్ స్కీం ద్వారా కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాలకు చెందిన తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కూళ్ళ తదితర గ్రామాల ఆయకట్టుకు సంబంధించి 6వేల ఎకరాలకు ఈ పంపింగ్ స్కీం ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. ఇందులో 7 పంపులు, 7 విద్యుత్ మోటార్లకు గాను 4 పంపులు మరమ్మతులకు గురయ్యాయి. ఏడు విద్యుత్ మోటార్లకు 4 పంపులు మరమ్మతులకు గురయ్యాయి. అలాగే ఏడు విద్యుత్ మోటార్లకు ఒకటి స్టాండ్‌బై కాగా మిగిలిన 6 మోటార్లకు 4 మోటార్లు రిపేరులో ఉన్నాయి. దీంతో 3 పంపులు, 2 మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ఇటీవల వీటి నిర్వహణకు రూ.34 లక్షలకు ఎస్టిమేట్ తయారుచేసి ప్రభుత్వానికి పంపామని, శాంక్షన్ రావాల్సి ఉందని ఏఈ ఆర్.విశ్వనాథ్‌రాజు తెలిపారు. 2022లో సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతుండగా జిల్లా కలెక్టర్ గ్రాంటుతో పంపింగ్ స్కీం రిపేరు చేయించి సాగునీరు విడుదల చేశారు. దీని మెయింటెన్స్ కింద కాంట్రాక్టరుకు రూ 6 లక్షలు బిల్లు రావాల్సి ఉండగా నేటికీ విడుదల కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది రెండు మోటార్లు మాత్రమే పనిచేయడంతో రైతులకు సాగునీరు అందకుండా పోయింది. పంపింగ్ స్కీం నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉపకేంద్రం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సక్రమంగా పనిచేయడం లేదని, అక్కడ పోల్స్ తుప్పుపట్టిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒకవైరు నెలక్రితం తెగిపోవడంతో సుమారు 8 నెలలుగా విద్యుత్ సరఫరా నిల్చిపోయిందన్నారు. ప్రస్తుత రబీసీజన్‌లో సాగునీటి ఎద్దడి ఏర్పడితే రైతుల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి పంపింగ్ స్కీంను వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.


తాతపూడి పంపింగ్ స్కీం నుంచి కాలువలోకి నీటిని పంపించే కంట్రోలింగ్ సిస్టం

తాపేశ్వరం సురుచిని సందర్శించిన యూపీ డీజీపీ

మండపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ డీజీపీ పిడపర్తి వెంకటరామశాస్త్రి కుటుంబ సమేతంగా ఆదివారం తాపేశ్వరం సురుచి స్వీట్‌స్టాల్‌ను సందర్శించి సంస్థ యజమాని పి.మల్లిఖార్జునరావుతో ముచ్చటించారు. కాజా విశిష్టతను తెలుపుతూ సంస్థ నుంచి ఆయనకు బాహుబలి కాజాను వారికి అందించారు.



పామర్రులో బీటలువారిన పొలాలకు సాగునీరు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
వంతు కేటాయించిన అధికారులు

కె.గంగవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పామర్రులో రావిడొడ్డి పొలంలో బీటలువారిన పంట పొలాలకు ఆదివారం సాగునీరు అందింది. పామర్రులో సాగునీటి కష్టాలు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలకు నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. ఆదివారం నీటిపారుదల శాఖ ఏఈ సుబ్రహ్మణ్యం బీడువారిన భూములను పరిశీలించారు. వంతు కేటాయించి రావిడొడ్డి పొలంలోని పంట పొలాలకు నీరు సరఫరా చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరం

మండపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనపర్తికి చెందిన సీడీఆర్ ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో తమ సేవలను అందించారు. ఇటీవల సంతానలేమికి కారణం దంపతుల జీవన సరళిలో వస్తున్న మార్పులేనని తెలిపారు. ముఖ్యంగా ఆలస్యంగా వివాహాలు కావడం ప్రధాన కారణమని వైద్యులు తెలిపారు. ఈ శిబిరంలో సంతాన లేమితో బాధపడుతున్న దంపతులకు వైద్య పరీక్షలు చేసి వారు తీసుకోవల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. శిబిరంలో స్కానింగ్, రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు కె.బందవి, సునీల్‌రెడ్డి సేవలందించారు. లయన్స్ క్లబ్ నిర్వాహకులు వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యక్రమ నిర్వాహకులు చక్కా రాంబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిలుకూరి బాపిరాజు, కార్యదర్శి ఎల్‌వీ నాగేంద్రబాబు, ట్రెజరర్ చెన్నా రాంబాబు, గుండు తాతరాజు, వెల్ల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆచరణ సాధ్యంకాని కొత్త మోటార్ నిబంధనలు

రావులపాలెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 1 నుంచి అమలులోకి తెచ్చిన కొత్త మోటార్ నిబంధనలు ఆచరణ సాధ్యం కాదని కోనసీమ వినియోగదారుల సంఘ స్థాపిత అధ్యక్షుడు మెర్ల శాస్త్రులు అన్నారు. ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగాయన్నారు. ఇప్పటి పరిస్థితులకు అనువైన విధానాలు ఉండాలే తప్ప షార్ట్‌కట్ విధానాలు, అధిక జరిమానాలతో సానుకూల ఫలితాలు సాధించడం సాధ్యం కాదన్నారు. సత్ఫలితాల కోసం ప్రజా సంఘాల అభిప్రాయాలను తీసుకుని చట్టాన్ని సవరించాలని సూచించారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

ఆత్రేయపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం అంకంపాలెం శివారున ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోళ్లు, కత్తులు, రూ.1100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్.రాము తెలిపారు. ఆత్రేయపురం సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి ఆటో నడుపుతున్న బండి దిలీప్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.


దీక్షలు చేస్తున్న కార్మికులు

ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల రిలే దీక్షలు

అమలాపురం రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో డ్రైవర్ బీఎస్ నారాయణ అక్రమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలో కేఎస్సీ ప్రసాద్, కేవీ రావు, వీఎస్ఎన్ మూర్తి, వీఎల్ రావు, బీబీబీ బాబు, పీఎస్ కుమార్, బీఎస్ రావు, ఎస్ఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, డ్రైవర్ నారాయణపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని నినాదాలు చేశారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. గ్యారేజీ గేటు వద్ద గేట్‌మీటింగ్ నిర్వహించి నారాయణపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నినాదాలు చేశారు. ఉప కార్యదర్శి రంగప్రసాద్, డిపో అధ్యక్షుడు ఆర్.నారాయణరావు పాల్గొన్నారు.